క్లుప్తంగా

మంగరాయుడికి వెన్న అలంకరణ

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామిని శనివారం భక్తులు వెన్నతో అలంకరించారు. ఆలయ మేనేజర్ కొ్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్‌కుమార్ ప్రత్యేక పజూలు చేపట్టారు.

రేషన్ దుకాణాలపై దాడులు



1వ రేషన్ షాప్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని రేషన్ దుకాణాలపై శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విజిలెన్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్ ఎస్‌ఐ నరేంద్ర మాట్లాడుతూ పట్టణంలోని 1వ రేషన్ షాప్‌లో యండీయూ ఆపరేటర్ దగ్గర ఉండాల్సిన స్టాక్ రేషన్ డీలర్ దగ్గర ఉండటంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 3వ రేషన్ షాప్ డీలర్ అబ్దుల్ బాషా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకొని అందుబాటులోకి రాకపోవటంతో షాప్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే విజిలెన్స్ దాడులు వైఎస్సార్ సీపీ అనుకూలంగా ఉన్న వారి షాపులపైనే చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. గత నెల రోజులుగా మరమ్మతులకు గురైన బోరును రిపేర్ చేయించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించారు. అందులో భాగంగా శనివారం గ్రామంలో మోటార్, బోరుకు మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఫెయిత్ హోమ్ పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిషుపై పీపుల్స్ పాఠశాల వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం రాయచోటి సుబ్బయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఫెయిత్ హోమ్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ డానియేల్ ప్రేమ్ కుమార్, పీపుల్స్ పాఠశాల సిబ్బంది సంగటి ప్రేమ్ కుమార్, నాయుడు, జైపాల్, అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి మూగజీవాలు మృతి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ పరిసరాల్లో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సంలో విద్యుత్ స్తంభం నేలకొరిగి రెండు ఆవులు, ఒక పొట్టేలు మృత్యువాత పడ్డాయి. బాధితుడు ప్రహ్లాద తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేత కోసం పొలానికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

ఉపాధి కోర్సులతో మంచి భవిష్యత్తు

ఎమ్మిగనూరుటౌన్: చదువుతో పాటు ఉపాధి కల్పించే మూడు నెలల కోర్సులైన మెడికల్ కోడింగ్, సైబర్ క్రైమ్ కోర్సులు చేయడం వల్ల యువతకు మంచి భవిష్యత్ వుంటుందని ప్రముఖ వైద్యులు మనోజ్‌కుమార్, శిల్పా, పట్టణ సీఐ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా బీఎస్సీ కంప్యూటర్స్ చేసిన విద్యార్థులకు రెండు నెలల సైబర్ క్రైమ్ కోర్స్, బీఎస్సీ చేసిన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ తీసుకొన్న వారికి కళాశాల చైర్మన్ గడిగె లింగప్ప, కరస్పాండెంట్ సత్యశ్రీల ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుబాబు, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధోబీ ఘాట్లను నిర్మించాలి



సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం ఇస్తున్న రజక కార్పొరేషన్ చైర్మన్ సి. సావిత్రి

ఆదోని సెంట్రల్: రజకులు బట్టలు ఉతకడానికి ధోబీ ఘాట్లను నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సి. సావిత్రి కోరారు. శనివారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణ ంలోని బాలే కొలనులో కొన్నేళ్లుగా రజకులు బట్టలు ఉతుకుతున్నారని తెలిపారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గోవిందప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

దేవర ప్రశాంతంగా జరుపుకోండి

నందవరం : నాగలదిన్నె గ్రామంలో ఈ నెల మే 6, 7వ తేదీన జరిగే గ్రామ దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మధుసూదన రావు గ్రామ పెద్దలకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కేశవ ఆధ్వర్యంలో నాగలదిన్నె గ్రామ పెద్దలు, ఇరు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామంలో దేవర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు.

భూసార పరీక్ష.. భూమికి రక్ష !

- బనవాసి కేవీకేలో భూసార, నీటి పరీక్షలు
- పరీక్షలకు అనువైన సమయం
- ఫలితాల ఆధారంగా పంటలు వేసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు
- అవసరమైన ఎరువులు, మందులనే వాడాలి



పరీక్ష కోసం మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: భూసారం ఎపుడూ ఒకేలా ఉండదు. వేసే పంటల్ని, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పులు చెందుతుంది. ఆ మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే మంచి పంటలు పండుతాయి. వ్యవసాయ పనుల్లో భూసార పరీక్షలు చేయించడం అతి ప్రధానమైనది, ముఖ్యమైనది కూడా. పరీక్ష ఫలితాన్ని అనుసరించి అందుకు అనువైన పంటలను వేసుకోవాలి. రైతులు ఇది గ్రహించి అనువైన సమయంలోనే స్పందించి భూసార పరీక్షలు చేయించుకోవడం ప్రయోజనకరం. ప్రస్తుతం రైతు సేవా కేంద్రల్లో భూసార పరీక్షలను, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నారు.

సాగుకు ముందే భూసార పరీక్ష..

మండల పరిధిలో 46,000 ఎకరాల సాగు భూమి ఉండగా, ఇందులో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే జూన్ మాసారంభం నుంచి నైరుతి రుతు పవనాలు ప్రవేశించి తొలకరి జల్లులు పడే అవకాశం ఉంటుంది. దీంతో ఇప్పటి నుంచే రైతులు నేలను చదును చేసుకోవడం, పొలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్లకంపలను తొలగించడం వంటి పనులు చేపట్టారు. అయితే ఇంత కంటే అతి ముఖ్యమైన వ్యవసాయ ప్రక్రియలో భూసార పరీక్షలు చేయించడం మరవకూడదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు 318 శాంపిల్స్ సేకరణ

బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నారు. మట్టి పరీక్షకు రూ.100 (ఒక శాంపిల్‌కు), నీటి పరీక్షకు రూ.60 (ఒక శాంపిల్‌కు) రైతులు చెల్లించాల్సి ఉంటుంది. మార్చి నుంచి ఇప్పటి వరకు 318 శాంపిల్స్ సేకరించారు. మట్టి పరీక్షలకు సంబంధించిన ఫలితాలు మూడు రోజుల్లో ఇస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే నీటి నమూనాలకు సంబంధించిన ఫలితాలు ఒక్క రోజులోనే ఇస్తున్నారు.

రైతుల్లో అవగాహన లోపం

భూసార పరీక్షలపై రైతులు ఎలాంటి సలహాలు, సూచనలు పొందకుండా ఇష్టానుసారంగా పంటలు వేయడం, క్రిమిసహారక మందులు వాడటం, అధిక ఎరువులు వాడకం వంటి కారణాల వల్ల పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భూమికి ఎంత శాతం ఏఏ లవణాలు, మూలకాల, ఖనిజాల శాతం ఎంత ఉందో తెలియకుండా ఇష్టానుసారంగా పెట్టుబడులు పెట్టి చేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

పీహెచ్ మీటర్ (ఉదజని సూచిక)

నల్ల చౌడు నేలలను, ఆమ్లనేలను తెలుసుకోవడానికి ఈ మీటర్ ద్వారా తెలుసుకోవచ్చు. పొలాల్లో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. వాటిలో చౌడుశాతం పెరుగుతున్నాయి. వీటిని నివారించడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి. ముఖ్యంగా జీలుగ విత్తనాలు వల్ల నల్లచౌడు పోతుంది.

కండక్టివ్ మీటర్

ఉప్పు నేలలను తెలుసుకోవడానికి ఈ మీటర్‌ను ఉపయోగిస్తారు. పొలాల్లో తెల్లగా పేరుకుపోయి ఉంటుంది. ఎక్కడైతే 1 శాతం కన్నా ఎక్కువ ఉంటే పొలాన్ని బాగా దున్నెసి ఒక రోజు వరకు నీళ్ల నిల్వ చేయాలి. ఆ తర్వాత నీళ్లను బయటకు పంపించేయాలి.

సూక్ష్మ పోషకాల లభ్యత

నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్, కాపర్ వంటివి తప్పనిసరిగా కావాలి. వీటిని తెలుసుకోవడం కోసం అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రోఫోటో మీటర్ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ పరికరం ఎమ్మిగనూరు, కర్నూలు, డోన్ కేంద్రాల్లో మాత్రమే ఉంది. జిల్లాలో 70 శాతం వరకు పొలాల్లో జింక్, ఇనుముగానీ తక్కువగా ఉంటాయి. వీటిని అధికారులు సూచనల మేరకు పొలాల్లో ఉపయోగించాలి.

నీటి పరీక్ష

వ్యవసాయ సాగుకు నీరు చాలా ముఖ్యం వీటిలో ఉప్పు నీళ్లు, చౌడు నీళ్లు ఉంటాయి. చౌడు నీళ్ల వల్ల పొలం తట్టుకోదు. నీళ్లు పారే కాలువలో జిప్సం 10 కిలోలు చొప్పున రెండు చోట్ల వేయాలి. నీళ్ల దుంకేచోటగానీ, ట్యాంకులోగానీ వేయవచ్చు. కొత్త బోరు,పాత బోరు, బావులలోని నీటిని పరీక్ష చేయించుకోవచ్చు. అలాగే నీళ్లలో చౌడు శాతం ఎక్కువగా ఉండే పొలం పాడైపోతుంది. చౌడుకు తట్టుకునే పంటలు వరి, పత్తి, పొద్దుతిరుగుడు, ఆముదం, రాగులు, జొన్నలను సాగు చేసుకోవచ్చు.

భూసార పరీక్షపై అవగాహన పెరగాలి



భూసార పరీక్షపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టినమూనా పరీక్ష లేకుండా పంట సాగు చేస్తే నష్టాలు తప్ప మరొకటి ఉండదు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నాం. మట్టి పరీక్షకు రూ.100 (ఒక శాంపిల్‌కు), నీటి పరీక్షకు రూ.60 (ఒక శాంపిల్‌కు) రైతులు చెల్లించాలి. మట్టి, నీటి సాంపిల్స్ సేకరణలో ఏమైన సందేహాలుంటే 80741 43694 (ప్రోగాం అసిస్టెంట్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్) నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

– డా. రాఘవేంద్రచౌదరి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కేవీకే బనవాసి

మట్టిని సేకరించే విధానం



బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి పరీక్ష చేస్తున్న తేజ్‌కుమార్

- మట్టి నమునా తీయవలసిన చోట చెత్తా, చెదారం లేకుండా చేతితో పక్కకు తీసివేయాలి. నాగలి, సాలు పోవునంతలోతు వరకు లేదా 6 అంగుళాలు లోతు వరకు 'వి' ఆకారంలో తవ్వాలి.
- సేకరించిన నమునాను శుభ్రమైన సంచి లేక గోనె సంచి పైనగాని పోసి కలపాలి. ఎంపిక చేసిన భాగంలో నమునాను సేకరించడానికి 10–15 స్థలాల నుంచి మట్టిని ప్రతి స్థలం నుంచి అరకిలో వరకు నమునాను సేకరించాలి.
- కలిపిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, కొయ్యలు మొదలైన వాటిని తీసివేయాలి. మట్టి తడిగా ఉంటే నీటిలో ఆరబెట్టాలి.
- కలిపిన మట్టిని 4 భాగాలుగా విడదీయాలి. ఈ భాగాల్లో ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతా రెండు భాగాలను తీసివేయాలి. ఇలా చేస్తూ చివరగా అరకిలో మట్టి నమునా వచ్చేలా చేయాలి. ఈ మట్టిని శుభ్రమైన గుడ్డ సంచిలో లేదా పాలిథిన్ సంచిలో నింపాలి. ఈ ప్యాకెట్‌లోపల నమునా వివరాలుగల సమాచార పత్రం ఉంచాలి.
- సమాచార పత్రంలో రైతు పూర్తి పేరు, తండ్రి పేరు, చిరునామా, పొలం పేరు, సర్వే నంబర్,ఎంత భూమి, మెట్ట లేదా నీటి పారుదల లేదా ఆరుతడి గత 3 సంవత్సరాలుగా వేసిన పైరుకి వాడిన ఎరువులు, పంట దిగుబడి వివరాలు, సాగు చేసే పంట వివరాలను రాయాలి. సేకరించిన మట్టి నమునాలను వ్యవసాయ అధికారి ద్వారా సమీపంలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి.

ఆదోని అభివృద్ధే లక్ష్యం



కాంట్రాక్టర్లతో చర్చిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని చైర్మన్ ముల్లా మహమ్మద్‌గౌస్, వైస్ చైర్మన్ నరసింహులు అన్నారు. శనివారం చైర్మన్ చాంబర్‌లో అభివృద్ధిపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా చూస్తానని భరోసానిచ్చారు. అనంతరం కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ సెక్షన్ల అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణాభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. అనంతరం వారి అభిప్రాయాలను సేకరించారు. అభివృద్ధిలో కలిసికట్టుగా పని చేద్దామని, ప్రతి సెక్షన్‌లోని సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొందామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని వైస్ చైర్మన్ నరసింహులు సూచించారు. అభివృద్ధిలో ప్రతి కౌన్సిలర్ తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, సందీప్‌రెడ్డి, బాలాజీ, ఉస్మాన్, ఇంతియాజ్, చలపతి, వసీం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



వ్యవసాయ అధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ

కౌతాళం: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, దీని కోసం అన్ని శాఖల అధికారులు పని చేయాలని ఎంపీపీ అమరేష్ అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెడిపోయిన బోర్లను గుర్తించి, వాటికి మరమ్మతులు చేపట్టి తాగునీటి ఎద్దడిని నివారించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా గ్రామాల్లో నెలకున్న సమస్యల గుర్తించి సభ దృష్టికి తెస్తే వాటిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో పరిష్కారించడానికి వీలుంటుందన్నారు. అకాల వర్షాలకు వరి ధాన్యం దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నా వ్యవసాయాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటంలేదని నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్ సభ దృష్టికి తెచ్చారు. నదిచాగి విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర వచ్చి అక్కడ ఉన్న పొలాలను పరిశీలించి కేవలం 9మంది రైతులకు మాత్రమే నష్టం జరిగినట్లు నివేదిక పంపడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో మిగత సభ్యులు ఎంపీపీ ఏఓ శేషాద్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు గ్రామాల్లో నష్టం జరిగితే నదిచాగిలో మాత్రమే వ్యక్తులను బట్టి 9మంది పేర్లు ఎలా రాశారని నిలదీశారు. దీంతో స్పందించిన శేషాద్రి మరోసారి గ్రామాలకు వెళ్లి నివేదిక తయారు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బుజ్జీస్వామి, లిఖీత, కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, ఈఓపీఆర్‌డీ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో పట్టపగలే చోరీ



పిశారి ఉస్మాన్ ఇంట్లో బిరువా పగలగొట్టిన దృశ్యం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో శనివారం పట్ట పగలే రెండిళ్లలో దొంగలు పడి చోరీకి పాల్పడ్డారు. మొట్టి వీధికు చెందిన పిశారి ఉస్మాన్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో ఉన్న తమ బంధువుల ఇంటి గృహప్రవేశానికి వెళ్తుండగా.. ఆయన పెద్ద కుమారుడు నబి రసూల్ శనివారం మధ్యాహ్నం బస్టాండ్‌కు తీసుకెళ్లి హైదరాబాదుకు వెళ్లే ప్రత్యేక వాహనంలో ఎక్కించి ఇంటికి తిరిగొచ్చాడు. అయితే ఇంటికి వేసిన తాళం పగుల గొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూశాడు. బీరువా కూడా పగిలిపోయి ఉంది. విషయాన్ని తండ్రి ఉస్మాన్‌కు తెలుపడంతో వారు వెనక్కి వచ్చి పరిశీలించగా మూడు తులాల బంగారు, 50 తులాల వెండి, రూ.లక్ష నగదు పోయినట్లు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ఇదిలా ఉండగా దొంగలు ఇంట్లో ఉన్న నూనెను బండలపై పోసి వెళ్లారు. ఇలా నూనె పోసి దొంగతనం చేసిన సంఘటన ఎక్కడ చూడలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. అంతముందు ఆ దొంగలే మైనార్టీ కాలనీలో శాలి పటేల్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారని అక్కడ ఏమీ దొరకకపోవడంతో ఉస్మాన్ ఇంట్లోకి దూరి దొంగతనం చేసి ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. బాధితుడు ఉస్మాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు.

సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆదోని అర్బన్: పీఎం సూర్య ఘర్ యోజన స్కీంను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ హరి, డీఈఈ పురుషోత్తం సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ప్రజలు, మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దహరివాణంలో వంద శాతం సోలార్ చేయాలని ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిష్పత్తి ఒకేలా ఉండాలి

ఆదోని సెంట్రల్: ప్రాథమిక తరగతుల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఒకేలా ఉండాలని ఎస్టీయూ జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ పి.నాగేంద్రప్ప అన్నారు. ఎస్టీయూ భవనంలో సీనియర్ నాయకులు వి.శ్రీనివాసులు అధ్యక్షతన ఎస్టీయూ నాయకుల సమావేశం శనివారం జరిగింది. విద్యాసంస్కరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతులకు, మిగిలిన ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయుల, విద్యార్థుల నిష్పత్తి తేడా ఉండేలా ఎస్‌జీటీలను కేటాయిస్తుందని తెలిపారు. ఇది సరైంది కాదన్నారు. శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, కాశీ విశ్వనాథ్ శాస్త్రి, జ్యోతిమూర్తి, నారాయణ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని రూరల్: పట్టణంలో శనివారం ఏఐవైఎఫ్ 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి అంజిత్‌గౌడ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీరేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు జెండాను ఆవిష్కరించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శనివారం ఏఐవైఎఫ్ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జెండాను ఆ సంఘ జిల్లా మాజీ సహాయకార్యదర్శి ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు రంగన్న, నాయకులు రాజీవ్, విజయేంద్ర పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నీటిని విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వేసవి దృష్ట్యా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తాగు నీటి కోసం ఎల్లెల్సీ నీటిని విడుదల చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు టీచర్ నాగన్న, గుడికల్ స్వామిదాసులు కోరారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘ నాయకులు సత్యన్న, అడ్వకేట్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో విషాదం

- ధైవ దర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు
- ఐదుగురు మృత్యువాత... 14 మందికి గాయాలు
- నలుగురు ఆదోని వాసులు
- శనివారం ముగిసిన అంత్యక్రియలు
- మిన్నంటిన బంధువుల రోదనలు





అక్కా చెల్లెళ్లు లక్ష్మి, చంద్రమ్మ మృతదేహాలు



కోడళ్లు చంద్రమ్మ, లక్ష్మి తనను విడిచి వెళ్లారంటూ రోదిస్తున్న అత్త రాములమ్మ



చంద్రమ్మ ఇంటి వద్ద మృతదేహాలను చూసేందుకు వచ్చిన ప్రజలు, బంధువులు

ఆదోని టౌన్: తమ పిల్లలు పదిలో మంచి మార్కులు సాధించారని ఉత్సాహంతో తమ ఇష్టదైవం శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం ఐదు కుటుంబాలు పిల్లాపాపలతో కలిసి గురువారం బొలెరో వాహనంలో ఆదోని నుంచి బయలుదేరి వెళ్లారు. తమ ఇష్టదైవం శ్రీశైలం మల్లన్నను ఇంటిల్లిపాది దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు ప్రసాదించాలని, భవిష్యత్‌లో ప్రయోజకులు కావాలని దేవదేవుడిని వేడుకున్నారు. కొన్ని గంటలపాటు మల్లన్న సన్నిధిలో గడిపిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఇంతలోని విధి చిన్నచూపు చూసింది.. వారి సంతోషం అంతా ఆవిరయ్యింది. కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిలో బైర్లూటి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదు మందిని పొట్టన పెట్టుకుంది. మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన ఐదు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. శనివారం వారి మృతదేహాలను ఆదోనికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల ఇళ్ల వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఇందిరానగర్‌లో విషాదం

నంద్యాల జిల్లా బైర్లూటీ సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆదోని పట్టణం ఇందిరానగర్‌కు చెందిన మంగలి గిడ్డయ్య(42) అక్కడికక్కడే మృతిచెందారు. కొడుకు అభిరామ్ పదిలో మంచి మార్కులు సాధించాడని, తన తమ్ముడి కుటుంబంతో పాటుగా బొలెరో వాహనంలో శ్రీశైలానికి వెళ్లాడు. శుక్రవారం బైర్లూటీ వద్ద జరిగిన ప్రమాదంలో గిడ్డయ్య మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

మృత్యువులోనూ వీడని బంధం

ఆదోని పట్టణం రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసముంటున్న అక్కాచెల్లెళ్లు లక్ష్మి, చంద్రమ్మ తోడి కోడళ్లు. చంద్రమ్మకు కొడుకు, కుమార్తె ఉన్నారు. లక్ష్మికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆడపడుచు శశికళ వారిలో కలిసి శ్రీశైలంకు వెళ్లింది. అయితే ఒకే కుటుంబానికి చెందిన లక్ష్మి, చంద్రమ్మ, శశికళ మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయింది. తోడికోడళ్లతో పాటు ఆడపడుచు శశికళ మృతిచెందింది. ఓర్వలేని దేవుడు తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చాడని ఆ కుటుంబంలోని మహిళలు, పెద్దలు కన్నీటి పర్యంతమయ్యారు.

మృతదేహాలను సందర్శించిన ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

ఆదోని పట్టణంలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన లక్ష్మి, చంద్రమ్మ, ఇందిరానగర్‌కు చెందిన గిడ్డయ్య మృతదేహాలను సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి, తహసీల్దార్ శివరాముడు సందర్శించారు. మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్ భరోసానిచ్చారు. అలాగే వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు తరలివచ్చి మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

'సూక్తి చంద్రిక' పుస్తకావిష్కరణ




పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాల బంధు గద్వాల సోమన్న రచించిన 68వ పుస్తకం 'సూక్తి చంద్రిక' ఆవిష్కరణ అలువా గ్రామం ఎర్నాకులం జిల్లా, కేరళ రాష్ట్రంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఫాదర్ సన్నీ జోసఫ్ ఇటలీ వారి సిల్వర్ జూబ్లీ మహోత్సవం సందర్భంగా ప్రావిన్షియల్ రెవరెండ్ ఫాదర్ క్రీస్తురాజు, ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. గద్వాల సోమన్నను ప్రముఖులు సత్కరించారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఆదోని సెంట్రల్: ప్రతి పిల్లవాడు మంచి క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ తిమోతి సిస్టర్ బ్లెస్సీ అన్నారు. శనివారం విరామ బైబిల్ పాఠశాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం పిల్లలతో కలిసి పట్టణ పుర విధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

అ'పూర్వ' కలయిక



నాటి ఉపాధ్యాయులతో 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల : మండల కేంద్రమైన గోనెగండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం గోనెగండ్లలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. ఇందులో భాగంగా నాడు తమకు చదువులు చెప్పిన గురువులు రామచంద్ర రెడ్డి, వెంకటరమణ, రాఘవ రెడ్డి, మాధవస్వామి, అన్వర్ బాషా, రాజేశ్వరి, జానకి రాముడు, అక్బర్‌లను సన్మానించి తమ గురు భక్తిని చాటుకున్నారు.

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వైఎంకే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. 2003–2004 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు 21 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులను నేర్పిన గురువులను సన్మానించారు.

చట్టాలను తెలుసుకోవాలి




మాట్లాడుతున్న జడ్జి యజ్ఞ నారాయణ

ఆదోని రూరల్: గ్రామాల్లోని ప్రజలు చట్టాల గురించి తెలుసుకోవాలని ఆదోని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని బల్లేకల్ గ్రామంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కోర్టుల్లో రాజీ కాదగిన కేసులకు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. భవన నిర్మాణ కార్మికులకు హక్కులు, పథకాల గురించి వివరించారు.

బైపాస్ నిర్మాణం చేపట్టాలి

నందవరం : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నందవరం మండలంలో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మఠం రాజశేఖర్‌స్వామి, గవ్వల నారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాసులుకి వినతి పత్రం అందజేశారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి మునికన్నన్

నందవరం : గ్రామాల్లో రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సర్వే అధికారి ఎం. మునికన్నన్ ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా, అవకతవకలకు తావు లేకుండా రీ సర్వేను పూర్తి చేయాలన్నారు. రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వే అధికారులు శ్రీనివాసులు, విజయకుమారి, మండల సర్వేయర్ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com